క్లుప్తంగా

చిత్రకారుడు అంజికి గజమాలతో సత్కారం



చిత్రకారుడు అంజిని సత్కరిస్తున్న చిత్రకళా ప్రదర్శన నిర్వాహకులు

కాట్రేనికోన: కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకొండి అంజిని ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియంలో డ్రీమ్స్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ సంస్థ వ్యవస్థాపకుడు రమేష్ గజమాలతో సత్కరించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియంలో జరిగిన చిత్రకళా ప్రదర్శనకు ముఖ్య అతిథిగా చిత్రకారుడు అంజి పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాసాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌పీఐ జిల్లా కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నిక



ఆర్‌పీఐ జిల్లా కమిటీకి ఎంపికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం సావరంలో ఆదివారం జరిగిన సమావేశంలో భారత రిపబ్లికన్ పార్టీ(ఆర్‌పీఐ) జిల్లా కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా గౌరవాధ్యక్షుడిగా దడాల రామకృష్ణ, అధ్యక్షుడిగా గిడ్డి జ్ఞాన ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా సకిలే పృధ్వీరాజు, కార్యదర్శిగా చీకురుమిల్లి శ్రీనివాస్, ఉప కార్యదర్శిగా బడుగు సత్యనారాయణ, కోశాధికారిగా చీకురుమిల్లి కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం రుషి, మట్టా సిద్దార్థ గౌతమ్, బల్ల సత్యనారాయణ, ఈవీవీ సత్యనారాయణ, కలకట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన సర్పంచ్



గొల్లవిల్లి బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఉన్న బాలికల వసతి గృహాన్ని స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆదివారం పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, వసతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యున్నతి కోసం అంకిత భావంతో పనిచేయాలని వార్డెన్ తులసికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జొన్నాడ చిన్ని, పంచాయతీ కార్యదర్శి పరమట సాయిబాబు, సచివాలయ పోలీస్ దివ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్ష చేస్తున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు

అమలాపురం టౌన్: ఏఐసీసీ నేత రాహుల్ గాంధీపై పరువు నష్టం దావా వేయడం, పార్లమెంట్ మెంబర్‌గా అనర్హుడిగా ప్రకటించడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అమలాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్షను ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా బుద్ధుని విగ్రహానికి వినతి పత్రం అందించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటెద్దు బాబి అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, ముషిణి రామకృష్ణారావు, మాచవరపు శివన్నారాయణ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు కఠోర ప్రాక్టీస్



హైజంప్ ప్రాక్టీసు చేస్తున్న యువతి

యానాం: పుదుచ్చేరి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ శారీరక దారుఢ్య పరీక్షకు యానాంకు చెందిన మహిళా అభ్యర్థులు తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆదివారం స్థానిక జవహర్ బాలభవన్ క్రీడా మైదానంలో పీఈటీ శేరు విష్ణు ఆధ్వర్యంలో రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర అంశాల్లో ప్రాక్టీస్ చేశారు. అనంతరం ఫిజికల్ టెస్ట్‌లకు హాజరయ్యేందుకు వారంతా పుదుచ్చేరి బయలుదేరి వెళ్లారు.

పాడి పశువులకు టీకాలతోనే రక్ష

- రెండు గిట్టలు కలిగిన జీవుల్లో గాలికుంటు వ్యాధి అధికం
- నిర్లక్ష్యం వహిస్తే పశువుల మృత్యువాత



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా పశు సంవర్ధక అధికారి జైపాల్

ఉప్పలగుప్తం: పశువుల పాల ఉత్పాదక శక్తిని దెబ్బతీసి మృత్యువాతకు గురిచేసే వ్యాధుల్లో ప్రధానమైనది గాలికుంటు వ్యాధి. ఫుట్ అండ్ మౌత్ డిసీజ్‌గా పేర్కొనే ఈ వ్యాధి వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. పాడి రైతులు సరైన చికిత్సా విధానాలు పాటిస్తే పశువులను కాపాడుకునే వీలుంటుంది. ప్రధానంగా గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ద్వారా గత పదేళ్లుగా సంవత్సరానికి రెండు విడతలుగా టీకాలు వేస్తున్నారు. ఈ టీకాలు వేయిస్తే పశువులు వైరస్‌బారిన పడే అవకాశాలు దాదాపుగా తగ్గిపోతాయని పశు వైద్యులు చెబుతున్నారు.

నెలాఖరు వరకూ టీకాలు

గాలికుంటుకు కారణమయ్యే వైరస్ ముఖ్యంగా గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు వంటి రెండు గిట్టలు కలిగిన జీవుల్లో వస్తాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. గాలికుంటు వ్యాధిని నివారించటానికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నిరోధక టీకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మార్చి 1వ తేదీ నుంచి గ్రామాల్లో పశు వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పశువులకు టీకాలు వేస్తున్నారు. ఈ టీకాల కార్యక్రమం నెలాఖరు వరకూ కొనసాగనుంది. మూడు నెలలు దాటిన ప్రతి దూడకు ఈ వ్యాక్సిన్ అందించాలని పశువైద్యులు స్పష్టం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1,53,542 గేదెలు, 75,460 ఆవులు ఉన్నాయి. వీటికి ఇప్పటికే ఓపీసీ సౌత్‌ఆఫ్రికన్ స్ట్రెయిన్-1, స్ట్రెయిన్-2 టీకాలు 2,15,050 అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపుగా 85 వేల టీకాలను అందించామని ఉన్నతాధికారులు తెలుపుతున్నారు. ఈ టీకాలను 4 డిగ్రీల సెల్సియస్ ఉండేలా ఫ్రిజ్‌లను సైతం ప్రభుత్వం అందించింది. ఈ ఏడాది పశువుల చెవులకు ఇనాఫ్ ట్యాగ్ ఉంటేనే గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నారు. ఇనాఫ్ ట్యాగ్ వేయించుకోవల్సిన బాధ్యత రైతులదేనని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధి లక్షణాలు

ముందుగా పశువు నోటి నుంచి చొంగ కారడం ప్రారంభమవుతుంది. గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు 104 నుంచి 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. పశువుల నాలుకలపై, చిగుళ్లపై పుండ్లు వస్తాయి. దీంతో పశువులు మేత మేయలేక రోజురోజుకు క్షీణిస్తాయి. పశువుల కాళ్ల డెక్కల మధ్యలో పుండ్లు ఏర్పడతాయి. దూడలు ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే వ్యాధి సోకి మరణిస్తాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గుతుంది. ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గుతుంది. వ్యాధి సోకిన పశువులు ఎండలో ఎక్కువ సేపు ఉండలేవు. ప్రధానంగా రెండు గిట్టలు కలిగిన జీవుల్లో వైరస్ తీవ్రత అధికంగా ఉంటుంది. గాలికుంటు వ్యాధి సోకినట్లు అనుమానం వస్తే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి పరీక్షలు చేయించి నివారణకు మందులు వాడుకోవాలి. గాలికుంటు వ్యాధి ఉందని తేలితే వాటి నివారణకు ఆక్సిటెట్రాసైక్లిన్, నిముసులైడ్ ఇంజెక్షన్లు చేయించాలి.

తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలి



పశువులకు వ్యాక్సిన్ వేయిస్తే పాల దిగుబడి తగ్గుతుందన్నది అపోహ మాత్రమే. టీకా వేయిస్తే పశువు యొక్క తత్వాన్ని బట్టి ఒక రోజు పాల దిగుబడి తగ్గినా వైరస్‌ను ఎదుర్కొని ఆరోగ్యంగా జీవించగలుగుతుంది. ఇప్పటికే గ్రామాల్లో పశు వైద్యులు, సహాయకులు టీకాలను వేస్తున్నారు. పాడి రైతులందరూ మీ ప్రాంతంలోని పశు వైద్యుల్ని కలిసి టీకాలు వేయించాలి.

– కేవీవీఎస్ఎస్ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

సకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పాల దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గిపోతుంది. తొలి దశలో గుర్తించి సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి రక్షించొచ్చు. అందుకే గాలికుంటుపై ఏమాత్రం సందేహమున్నా వెంటనే స్థానిక పశు వైద్యుల్ని సంప్రదించాలి.

– అడిదల జైపాల్, జిల్లా పశు సంవర్ధక అధికారి

ఎంపీ అనురాధకు శుభాకాంక్షలు



ఎంపీ అనురాధకు శుభాకాంక్షలు తెలుపుతున్న మొగళ్ళమూరు సర్పంచ్ విష్ణు తదితరులు

అల్లవరం: కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ సభ్యురాలిగా నియమితులైన ఎంపీ చింతా అనురాధని ఆదివారం పలువురు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మొగళ్ళమూరులోని ఎంపీ నివాసంలో ఉప్పలగుప్తం జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, స్థానిక సర్పంచ్ రాయుడు విష్ణు, అల్లవరం ఎంపీటీసీ నిచ్చెనకోళ్ల మౌనిక, సన్నవిల్లి రాంజీ నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎంపీ అనురాధని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ఒంటి పూట తరగతులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వేసవి తీవ్రత నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ నెల 27 సోమవారం నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని ఆర్ఏఓ మునిస్వామి ఆదివారం ఆదేశాలు జారీచేశారు. రోజూ ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు.

మనిషి మనుగడలో పెంపుడు జంతువులూ భాగమే

ఆకట్టుకున్న పశువులు, కోళ్లు, కుక్కల ప్రదర్శన



ప్రత్యేక ఆకర్షణగా కర్ణాటక ప్రాంతానికి చెందిన ముధిల్‌జాతి పెంపుడు కుక్కలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: వ్యవసాయానికి అనుబంధంగా మనిషి మనుగడలో పశువులు, పెంపుడు జంతువులు ఓ భాగమేనని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం పుదుచ్చేరి పశుగణాభివృద్ధి, పశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో పశువులు, కోళ్లు, పక్షులు, పెంపుడు కుక్కల ప్రదర్శన నిర్వహించారు.

బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆర్ఏఓ మునిస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవులు, గేదెలు, మేకల పెంపకం ద్వారా పలు కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. యానాం నియోజకవర్గ పరిధిలోని ఆవులు, గేదెలు-70, కోళ్లు-35, పెంపుడుకుక్కలు-30 మొత్తం 135 ప్రదర్శించారు. ఆవుల విభాగంలో ప్రథమ బహుమతి కూరాకుల సత్తిబాబు, ద్వితీయ బహుమతి చంపటి కృష్ణంరాజు, తృతీయబహుమతి వంటెద్దు వాసుకు లభించగా, గేదెల విభాగంలో వంటెద్దు జగదీశ్వరీ, ద్వితీయబహుమతి కోనామి లక్ష్మీనారాయణ, తృతీయబహుమతి కూరాకుల వంశీకి లభించింది. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మెల్ల వెంకటరమణ, డాక్టర్ చెక్కపల్లి శ్రీరామ్, డాక్టర్ కె.ఆంద్రు జాబ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారి ఉద్యమ స్ఫూర్తితోనే యూటీఎఫ్ నిర్మాణం




అప్పారి, వత్సవాయి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సాబ్జీ

అమలాపురం టౌన్: యూటీఎఫ్(యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) వ్యవస్థాపక కార్యదర్శి అప్పారి వెంకటస్వామి, సీనియర్ నేత వత్సవాయి సూర్యనారాయణరాజుల ఉద్యమ స్ఫూర్తితోనే నాడు యూటీఎఫ్ నిర్మాణం జరిగిందని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో అప్పారి, వత్సవాయిల వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ నేతలు చిట్టిబాబు, ఆర్.వీరాస్వామి, ఎస్.జ్యోతిబసు, ఎంటీవీ సుబ్బారావు, సురేంద్ర, పీఎస్ శిరోమణి, కె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నాయకులు అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజుల వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి గంటా సూర్యచంద్రరావు, మండల శాఖ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, కాశి వెంకటాచార్య, గ్రంధి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



దంగేటి దివ్య(ఫైల్)

అమలాపురం రూరల్: వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన అమలాపురం రూరల్ మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండారులంక గ్రామ పరిధిలోని కందులపాడు కాలనీకి చెందిన దంగేటి దివ్య(32) శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె భర్త దంగేటి పార్థసారథి అమలాపురం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం ఈదరపల్లి వంతెన వద్ద బెండా కాలువలో ఆమె మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పిల్లలు లేకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. భర్త పార్థసారథి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అందే పరదేశి తెలిపారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



ప్రధానోపాధ్యాయిని సుందరిని సత్కరిస్తున్న విద్యార్థినులు



నృత్యాలతో అలరించిన విద్యార్థినులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల ఫేర్ వెల్ డేను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి మాట్లాడుతూ చక్కని ప్రణాళిక ద్వారా ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధమవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు నున్న కల్యాణచక్రవర్తి, కోటిపల్లి అబ్బు, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఆదివారం పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

తాళ్లరేవు: ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. స్థానిక లయన్స్‌క్లబ్ హాలులో చల్లా సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజబాబు మాట్లాడుతూ భూ యజమాని సంతకం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, దీని కోసం చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.సత్తిబాబు, కె.లక్ష్మణరావు, చంద్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభాగ్యులకు అన్నదానం



అభాగ్యులకు అన్నదాన వితరణలో పాల్గొన్న డైమండ్ గ్రూపు సభ్యులు

తాళ్లరేవు: 1987–88 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన డైమండ్ గ్రూపు సభ్యులు ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో అభాగ్యులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సభ్యులంతా చిన్ననాటి సంగతులను నెమరు వేసుకున్నారు. కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకం 85వ రోజు సందర్భంగా అభాగ్యులకు అన్నదానంతో పాటు పండ్లు, టూత్ బ్రష్‌లు, టూత్ పేస్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో డైమండ్ గ్రూపు ప్రతినిధులు బి.శ్రీనివాసరెడ్డి, పొన్నాడ పేరయ్యరాజు, వాడ్రేవు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

1500 మందికి మధుమేహ పరీక్షలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన డయాబెటిక్ స్క్రీనింగ్ కార్యక్రమంలో 1500 మందికి డయాబెటిక్ పరీక్షలు పూర్తి చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శివాలయం రోడ్‌లో 18వ రోజు కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. క్లబ్‌కు సహకరించిన గ్రామపెద్దలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

అనాస మొక్క వేరుకు కాయ



పెదపళ్లలో అనాస మొక్కకు వేరు భాగంలో కాసిన కాయ

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో అనాస మొక్క వేరు పిలకకు కాయ కాసింది. గ్రామానికి చెందిన గొడవర్తి సూర్యనారాయణ తన పెరట్లో ఇటీవల చిన్న మొక్కను తీసుకుని వచ్చి నాటాడు. అయితే పాతిన నెల రోజుల వ్యవధిలో వేరు దశలో ఉండగానే పిందె పూసి కాయగా మారింది. మరో పక్షం రోజుల్లో పక్వానికి వచ్చే అవకాశం ఉందని యజమాని సూర్యనారాయణ చెబుతున్నారు.

తాళ్లరేవులో ట్రాఫిక్ ఇబ్బందులు



దేవీమహల్ సెంటర్‌లో రహదారిపైనే నిలిపిన వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు



వ్యాపార దుకాణం బయట రోడ్డుకు అడ్డుగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

నిత్యం అవస్థలు పడుతున్న ప్రజలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని పలు సెంటర్లలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అత్యంత రద్దీగా ఉండే సంతపేట, చెరువుగట్టు, దేవీమహల్ సెంటర్లలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో తిప్పలు తప్పడం లేదు. ప్రధాన రహదారిపైనే పలు వ్యాపార దుకాణాల వద్ద వాహనాలను నిలిపేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. సంతపేట సెంటర్‌లో తోపుడు బళ్లు, రహదారి చెంతనే ఏర్పాటు చేస్తున్న వ్యాపార దుకాణాలతో భారీ వాహనాలు తప్పుకునే పరిస్థితి ఉండడం లేదు. ప్రైవేటు వ్యాపార సముదాయాల యజమానులు వినియోగదారుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై కోరంగి పోలీసులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

యానాం చేరుకున్న మున్సిపల్ కమిషనర్



యానాం విచ్చేసిన కొత్త మున్సిపల్ కమిషనర్ గోయల్

యానాం: నూతన మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్(పిసిఎస్) కేడర్ యువ అధికారి ద్విజ్ గోయల్ ఆదివారం యానాం చేరుకున్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఏఈ మేడిశెట్టి రామలింగేశ్వరరావు, మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, చెల్లి గోపీనాథ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. సంవత్సరాల తరబడి ఇన్‌చార్జి కమిషనర్‌లుగా వివిధ స్థాయి ఉద్యోగులను ప్రభుత్వం నియమిస్తూ చేతులు దులుపుకుండటంతో మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కల్పన, మున్సిపాల్ షాపుల అద్దెల నిర్వహణ లోపం, పన్నుల వసూళ్లలో అలసత్వం తదితర సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అసెంబ్లీలో పీసీఎస్ అధికారికి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించాలని కోరారు. దీంతో యువఅధికారి గోయల్‌ను ప్రభుత్వం కమిషనర్‌గా నియమించింది.

పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఈ రాంబాబు

అమలాపురం రూరల్: పాలిటెక్నిక్ విద్యతో వస్తున్న ఉపాధి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు అన్నారు. భట్లపాలెం బీవీసీ పాలిటెక్నిక్ కళాశాలల్లో సెలబ్రేషన్ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గత మూడు రోజులుగా వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బండారు ఫణిశంకర్, ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, ఏవో జక్కం కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం సీ మదన్, శేషుకుమార్, మేడిచర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.5.50 కోట్లతో అన్నదాన భవనం



శంకుస్థాపన కోసం చేసిన ఏర్పాట్లు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి సంబంధించి రూ.5.50 కోట్ల నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ రోజురోజుకూ ఆలయంలో భక్తుల సందడి పెరుగుతుందన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నదాన పథకానికి సంబంధించి రూ.5.50 కోట్లతో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా సోమవారం ఉదయం శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు.

ఆక్సిజన్ అసోసియేషన్‌కు బెస్ట్ యూత్ క్లబ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అధ్యక్షుడు గంగాధరం

మామిడికుదురు: పాశర్లపూడి కేంద్రంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆక్సిజన్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బెస్ట్ యూత్ క్లబ్ అవార్డు అందుకుంది. కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, సభ్యుడు మొల్లేటి తలుపులు ఉత్తమ యూత్ క్లబ్ అవార్డును అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయాధికారి అమృతేష్ చేతుల ఈ అవార్డును అందుకున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధరం ఆదివారం తెలిపారు. జ్ఞాపికతో పాటు రూ.25 నగదు ప్రోత్సాహం, సర్టిఫికెట్ అందించారన్నారు. తమ అసోసియేషన్‌కు అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని గంగాధరం చెప్పారు.